ప్రజాశక్తి



రేపు మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన పదో తరగతి నుంచి పిజి విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఈనెల 8న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు నకలు, మూడు బయోడేటా పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9550967353, 8317652552, 9704960160 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

మిచౌంగ్ ముంచింది

- జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు
- పొలాల్లో భారీగా చేరిన వర్షపు నీరు
- నేలకొరిగిన వరి చేలు
- తడిసిముద్దయిన వరి ఓవులు



జి.సిగడాం : నీటిపాలైన కోత కోసిన వరిచేను

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ, ఆమదాలవలస, జి.సిగడాం, కవిటి

మిచౌంగ్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పలు ప్రాంతాల్లో పొలాలను ముంచెత్తాయి. సోమ, మంగళవారాల్లో పెద్దగా వర్షాలు లేకపోయినా, బుధవారం జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షపు జల్లులు తీవ్రంగా ఉండడంతో వరి పైరు నేలకొరింది. కోతలు పూర్తయిన చోట పొలాల్లో వరి ఓవులు ఉండిపోవడంతో తడిచి ముద్దయ్యాయి. జిల్లాలో తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయి పరిస్థితులపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జిల్లా అధికారులతో మాట్లాడారు.

తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఇచ్ఛాపురంలో అత్యధికంగా 43.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గార మండలం తులుగులో అత్యల్పంగా 0.5 మి.మీ వర్షపాతం నమోదైంది. జోరు వర్షాల ప్రభావంతో ఇచ్ఛాపురం, కవిటి, ఎల్‌ఎన్‌పేట, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, జి.సిగడాం ప్రాంతాల్లో వరి చేలు నేలకొరిగాయి. పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో వరి ఓవులు నీట మునిగాయి. ఆమదాలవలస మండలం కొర్లకోట, చీమలవలస, కొత్తవలస, దూసి, వంజంగి, రామచంద్రాపురం, చెవ్వాకులపేట, తొగ్గవలస తదితర ప్రాంతాల్లో 150 ఎకరాల్లో పంట నీట మునిగింది. అల్లిన, పెద్దపేట, బూర్జ, లాబాం, కొల్లివలస, డొంకలపర్త తదితర గ్రామాల్లో వాగులు పొంగడంతో పొలాల్లోకి నీరు చేరింది. పలు ప్రాంతాల్లో ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు విస్తారంగా కురిసిన వర్షాలకు తడిసి ముద్దయ్యాయి.

జిల్లాలో వర్షపాతం వివరాలు (మి.మీల్లో)

మండలం	ప్రాంతం	వర్షపాతం
ఇచ్ఛాపురం	ఇచ్ఛాపురం	43.5
కవిటి	రాజపురం	28.75
ఎల్ఎన్‌పేట	ఎల్.ఎన్‌పేట	25.75
ఆమదాలవలస	ఆమదాలవలస	23.75
రణస్థలం	పైడిభీమవరం	23.0
హిరమండలం	హిరమండలం	21.75
గార	గార	20.75
సరుబుజ్జిలి	విజయరామపురం	20.25
ఇచ్ఛాపురం	బొడ్డపడ	20.25
ఎచ్చెర్ల	ఎచ్చెర్ల	19.5
హిరమండలం	గొట్టాబ్యారేజీ	18.75
శ్రీకాకుళం	శ్రీకాకుళం	18.50
ఎల్ఎన్‌పేట	కోవిలాం	18.50
ఆమదాలవలస	చింతాడ	13.0
రణస్థలం	గరికపాలెం	12.5
కంచిలి	కంచిలి	12.25
లావేరు	లావేరు	10.50



ఆమదాలవలస : నీట మునిగిన వరి పనలను చూపిస్తున్న రైతులు

తుపాను ప్రభావంపై సిఎం వీడియో కాన్ఫరెన్స్

తుపాను ప్రభావం, జిల్లాలో తీసుకుంటున్న సహాయక చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ క్షేత్రస్థాయి పరిస్థితులపై జిల్లా అధికారులతో మాట్లాడారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులు పూర్తి ఆధారాలతో కూడిన సమాచారాన్ని ఆయా గ్రామాల పరిధిలోని రైతుభరోసా కేంద్రాలకు సమాచారం అందజేయాలని సూచించారు. ఆర్‌బికె ఉద్యోగులు పంట నష్టాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేసి సమగ్ర సమాచారాన్ని తెలియజేయాలన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండి పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలించి పంట నష్టాలను నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులు, గోడ కూలిన ఘటనలు, పశు సంపదకు నష్టం వాటిల్లితే తక్షణమే రెవెన్యూ యంత్రాంగం నమోదు చేయాలని చెప్పారు. వీటిని రెండు రోజుల్లో నివేదించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్, ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాసేజ్‌లోకి నీరు

జి.సిగడాం రైల్వే అండర్‌పాసేజ్ మార్గంలోకి భారీగా వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఎస్‌పిఆర్ పురం, మధుపాం, ఎందువ, నడిమివలస తదితర గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు.





కవిటి : నీటిపాలై నేలకొరిగిన వరిచేను

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత 67వ వర్ధంతి సందర్భంగా నగరంలోని అంబేద్కర్ కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక న్యాయం కోసం జీవితాన్ని త్యాగం చేసి ఇచ్చిన రాజ్యాంగాన్ని బిజెపి ప్రభుత్వం భూస్థాపితం చేయాలని చూస్తోందని చెప్పారు. పౌర హక్కులు, ప్రాథమిక హక్కులను రద్దు చేసి నిరంకుశ పద్ధతిలో పాలన సాగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

మనుధర్మ సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్ది అగ్రకుల దురహంకారాన్ని అన్ని కులాలపై రుద్దడానికి ప్రయత్నం చేస్తోందని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక మన రాష్ట్రంతో సహా అనేక రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని, పరువు హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి రక్షణగా ప్రభుత్వం ఆర్థిక సహాయం, ఉద్యోగం గ్యారంటీ చేసి అండగా ఉండాలని, వారి రక్షణకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు కుల, మతాలకతీతంగా అందరం పూనుకొని ప్రతిజ్ఞ తీసుకోవడమే అంబేద్కర్ ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, ఆర్.ప్రకాష్, బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేతన పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఉపాధ్యక్షులు కె.నాగమణి, గౌరవాధ్యక్షులు టి.రాజేశ్వరి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద కూడలి వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా, వేతనాలు మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నెర్చవేర్చలేదని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని గతేడాది సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా, రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. రిటైర్డ్ అయిన సందర్భంలో నామినల్ మొత్తం ఇవ్వడం వల్ల ఒంటరి మహిళలు, కుటుంబ ఆదరణ లేని వాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 48 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్వాడీలు సర్వీసులో చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయడం లేదని చెప్పారు. సమస్యలపై అంగన్వాడీలు దశల వారీగా అనేక ఆందోళనలు చేపట్టారని, అధికారులతో చర్చలు జరిగినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీంతో ఈనెల ఎనిమిదో తేదీ నుంచి సెంటర్లని మూసివేసి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలకు పెంచాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, డి.ముత్యాలమ్మ, సిహెచ్.అరుణ, అప్పలనరసమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో హోంగార్డులు కీలకం

ఎస్‌పి జి.ఆర్ రాధిక



మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, శ్రీకాకుళం

పోలీస్ శాఖలో హోంగార్డుల వ్యవస్థ కీలకమని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని ఎచ్చెర్లలోని పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1965లో స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిన హోంగార్డు వ్యవస్థ నేడు పోలీసు శాఖలో కీలకంగా మారిందన్నారు. హోంగార్డుల సేవలను గుర్తించిన ప్రభుత్వం వారిని రెగ్యులరైజ్ చేసి రెండు రోజుల సెలవుతో నెల రోజులూ పనిచేసేలా వేతనం చెల్లిస్తోందన్నారు. హోంగార్డుల సంక్షేమంపై పోలీసుశాఖ దృష్టిపెట్టిందని తెలిపారు. అందులో భాగంగానే విధుల్లో మృతి చెందిన హోంగార్డు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తోందని చెప్పారు. సహోద్యోగి మరణిస్తే తోటి సిబ్బంది ఒకరోజు వేతనాన్ని స్వచ్ఛందంగా విరాళాలు అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటున్నారని తెలిపారు. కోపరేటివ్ సొసైటీ ద్వారా హోంగార్డు పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి కుటుంబ అవసరాలకు తక్కువ వడ్డీతో రుణాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టను పెంచేలా అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో మృతి చెందిన హోంగార్డు గాసయ్య తనయుడు రామారావుకు నియామక పత్రాన్ని, రిటైర్డ్ అయిన రాజారావు కుటుంబ సభ్యులకు రూ.4.30 లక్షల చెక్కును అందజేశారు. పలువురు హోంగార్డులకు హాట్‌బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఇబి ఎఎస్‌పి వి.ఎన్ మణికంఠ, ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు కె.బాలరాజు, సిహెచ్.జి.వి ప్రసాదరావు, కె.శ్రీనివాసన్, ఎఒ సిహెచ్.గోపీనాథ్, ఆర్ఐలు కె.నర్సింగరావు, ఉమామహేష్, హోంగార్డులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి

పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాలో నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్ఇబి అదనపు ఎస్‌పి వి.ఎన్ మణికంఠతో కలిసి నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటుసారా విక్రయాలపై నిఘా పెట్టి దాడులు చేయాలన్నారు. స్థానిక పోలీసులతో కలిసి ఎస్ఇబి అధికారులు పట్టణ, గ్రామాల్లో కార్డాన్‌సెర్చ్ నిర్వహించి గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాలన్నారు. నాటుసారా తయారీ మార్గాలపై ముందస్తు సమాచారాన్ని తయారీకి వినియోగించే ముడి పదార్థాలను నిర్వీర్యం చేయాలన్నారు. ఇటీవల కాలంలో పేకాట స్థావరాలపై చేపట్టిన దాడులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల గంజాయి, నాటుసారా, మద్యం, పలు కేసుల ప్రాపర్టీని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

బల్క్ దరఖాస్తులు ఇస్తే క్రిమినల్ చర్యలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితాలో సవరణల కోసం చేపడుతున్న ప్రక్రియలో ఎవరైనా గంపగుత్త (బల్క్)గా దరఖాస్తులు ఇస్తే క్రిమినల్ చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. పరిపూర్ణమైన ఓటర్ల జాబితా తయారు చేయడానికి జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు కూడా సమన్వయంతో పనిచేస్తే చిన్న చిన్న తప్పిదాలకు సైతం ఆస్కారం ఉండదన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీలతో జిల్లాస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా విడుదల చేసిన తర్వాత తమ పార్టీకి చెందిన వారి ఓట్లు గల్లంతయ్యాయని, గంపగుత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారంటూ కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. అలాంటివి ఏమైనా ఉంటే పోలింగ్ స్టేషన్ నంబర్లతో రాతపూర్వకంగా ఆధారాలతో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంతో కష్టపడి పనిచేసే యంత్రాంగంపై బురద జల్లరాదని, వారిపై నమ్మకం ఉంచాలని కోరారు.

తెలంగాణలో ఓటు వేసిన వారిని మన రాష్ట్రంలోనూ ఓటర్లుగా నమోదు చేసేందుకు ఒక పార్టీ ప్రయత్నిస్తోందని వైసిపి నాయకులు రౌతు శంకరరావు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఈ అంశాన్ని పరిశీలిస్తోందని కలెక్టర్ చెప్పారు. ఈనెల 9వ తేదీన బల్క్‌గా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని, ఆ ఒక్కరోజు వివరాలు అందజేయాలని టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు కోరారు. బల్క్‌గా దరఖాస్తులు ఇచ్చే వారిపై కేసులు నమోదు చేస్తామని, ఎలాంటి దరఖాస్తులనైనా ముగ్గురు సభ్యుల బృందం పరిశీలిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. రాగోలు, గూడెం, చాపురం పంచాయతీ పరిధిలో 2004 నుంచి వైద్య విద్యార్థుల ఓట్లు అలాగే ఉండిపోయాయని వాటిని తొలగించడం లేదని బిఎస్‌పి నాయకులు ఆర్.సోమేశ్వరరావు తెలిపారు. రెండు నెలల కిందటే ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలనలో అలాంటి వాటిని తొలగించామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంకా అలాంటి ఓట్లు ఉంటే పోలింగ్ స్టేషన్ల వారీగా ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. ఈనెల 26వ తేదీలోగా అన్ని రకాల క్లయిమ్‌లను పరిష్కరించి మార్పులు, చేర్పులు, ఇతర సవరణలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాను జనవరి 5న విడుదల చేస్తామని తెలిపారు.

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాతా శిశు మరణాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతాశిశు మరణాలకు ఆస్కారం లేని విధంగా వైద్యారోగ్య, స్త్రీ,శిశుసంక్షేమ శాఖల సిబ్బంది పనిచేయాలని సూచించారు. వైద్యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో సేవలు అందించాలన్నారు. ప్రభుత్వాస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణుల వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల కోసం ప్రోత్సహించాలన్నారు. అవసరమైన పరీక్షలను నిర్వహిస్తూ సుఖ ప్రసవమయ్యే విధంగా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా రక్తహీనత సమస్య లేకుండా అవసరమైన మందులు అందించాలని సూచించారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి నవంబరు వరకు సంభవించిన 70 మాతాశిశు మరణాలపై సంబంధిత వైద్య పరీక్షల నివేదికలు, పోస్టుమార్టం రిపోర్టును క్షుణ్ణంగా తనిఖీ చేసి మరణాలు సంభవించడానికి గల కారణాలపై సమీక్షించారు. గుప్పెడుపేట, రెంటికోట, రట్టిలో గర్భిణుల మృతిపై విచారణ చేపట్టిన అనంతరం పలువురుకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎడిఎంహెచ్ఒ అనురాధ, డిసిహెచ్ఎస్ భాస్కరరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, వైద్యులు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కేసుల రాజీకి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. జిల్లా కోర్టులోని ఆయన ఛాంబరులో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ని సూర్యారావు, పొన్నాడ రాముతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందన్నారు. సమావేశంలో మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీదేవి, నాలుగో అదనపు న్యాయమూర్తి మహేంద్ర ఫణికుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన మున్సిపల్ ఉపాధ్యాయులు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, బదిలీలు, ప్రమోషన్లు, అప్‌గ్రేడేషన్, పిఎఫ్ అకౌంట్ల కేటాయింపు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లును కొత్త డిడిఒల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. భవనాల అద్దె, కరెంట్ బిల్లులు, అన్నిరకాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాశరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.కిషోర్ కుమార్, నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.వైకుంఠరావు, టి.సీతారాం, బి.వెంకటరావు, కె.అప్పన్నదాసు, ఎ.చిన్నవాడు, డి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేద్కర్


ఆమదాలవలస : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న స్పీకర్ సీతారాం


టెక్కలి రూరల్ : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సిపిఎం నాయకులు


వజ్రపుకొత్తూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమసమాజ స్థాపనే ధ్యేయంగా సిఎం జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం అంబేద్కర్ 67 వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు సమాజంలో ఉన్న వివక్షతను రూపుమాపేందుకు అంబేద్కర్ జీవితకాలం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంఘ సంస్కర్తగా సమాజంలో పేరుగాంచిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాతగా అంటరానితనంపై ఆయన పూరించిన సమర శంఖారావం చరిత్ర ఉన్నంత కాలం నిలిచిపోతుందన్నారు. దళిత, మహిళ, కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడన్నారు. స్వాతంత్ర భారతావనికి తొలి న్యాయశాఖ మంత్రిగా అమూల్యమైన సేవలు అందించి అనేక దేశాల రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి భారతదేశానికి దృఢమైన రాజ్యాంగాన్ని అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పారిశ్రామికీకరణ వ్యవసాయ అభివృద్దే దేశానికి ఊతమిస్తాయని బలంగా నమ్మిన వ్యక్తన్నారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు మామిడి రమేష్ కుమార్, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి రవి, సాదు కామేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి జిల్లా టిడిపి అధ్యక్షులు కూన రవికుమార్ పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల అప్పారావు, దళిత నాయకులు తోట రాము, రాడ విజయకుమార్, మాజీ కౌన్సిలర్ బోర గోవిందరావు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని సాయిరాం, దాలయ్య, అప్పన్న, రమణ, సీతారాం పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో పొందూరు పట్టణంలో, కింతలి గ్రామాలలో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్, దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సాకేటి నాగరాజు, పొందూరు దళిత నాయకులు మెరక పోతయ్య, వజ్రగడ హరి, కంఠ శ్రీను, ఆదినారాయణ, అప్పారావు, సంజీవ భవానీ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టరు బాబా సాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమం దళిత సంఘాల ఆధ్వర్యాన నగరంలో పాలకొండ రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు, కార్యక్రమంలో ఎస్ఎన్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, దళిత నాయకులు కానుకుర్తి గోవింద్, సతివాడ చిరంజీవి, గుంట రామారావు, దుర్గ, టెంక నాని పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: బిఆర్ అంబేద్కర్ 67 వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, జిల్లా దళిత మహాసభ ఉపాధ్యక్షులు డి.కుసుమ, మండలశాఖ అధ్యక్షులు కడియారపు కుమార్, ఉపాధ్యక్షులు కె.రాజయ్య, కె.అప్పారావు పాల్గొన్నారు. మండలంలో దేరసాం గ్రామంలో అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో యువసేన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ, దువ్వాన చినరాము, దువ్వాన గిరి, బంటు రాము, బంటు రాముడు పాల్గొన్నారు.

జి.సిగడాం: అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలో అద్దానంపేట ప్రాథమిక పాఠశాల, కెజిబివి మోడల్ స్కూల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే అద్దానంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అంబేద్కర్ వేషధారణలు వేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో ఒవిపేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విశ్రాంత డిప్యూటీ డిఇఒ ఇసాయి వెంకటరావు, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి సూర్యరావు, ప్రధానోపాధ్యాయులు కేత సూర్యనారాయణ, మల్లిబాబు, శ్రీను పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్రవీధిలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు కొల్లి యల్లయ్య, యర్ర వెంకట్రావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన హక్కులను, సదుపాయాలను అమలు జరిగే క్రమంలో ఇప్పటికీ అణగారిన వర్గాలకు అందించటంలో ప్రస్తుత పాలకులు వివక్షత చూపుతున్నాయని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత లౌకికతత్వానికి తిలోదకాలు ఇచ్చి మతోన్మాదాన్ని పెంచుకుపోతున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, పినిమింటి రామారావు, వై.శివరావు, వి.తిరుమల, యు.శంఖర్, జోగి లక్ష్మణరావు, యర్ర కొండలరావు పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ కూడలిలోని విగ్రహానికి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుల బసవల ధనుంజయరావు, ప్రజాసంఘాలు నాయకులు చల్లా రామారావు, మాజీ ఎంపిపి సంపతరావు రాఘవరావు, అట్లా రాహుల్ కుమార్, బసవల గోపాలరావు, అక్కురాడ తాతారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న, సర్పంచ్‌లు పేడాడ వెంకటరావు, గొద్దు చిరంజీవి పాల్గొన్నారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు, బోకర జడ్డెన్న, చల్ల చిరంజీవి, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాధం, సామ సంజీవరావు, స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆవరణలో ఎంపిఇఒ ఎస్.అప్పలనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కవిటి : మండలంలోని బొరివంకలో మండల దళిత సంఘం అధ్యక్షుడు మద్దిలి కేశవరావు, బలగ నారాయణమూర్తి, బలగ ధర్మారావు, బలగ సూర్యనారాయణ, బెజ్జిపుట్టుగలో పొందల కృష్ణారావు, ఎఐ నరహింహమూర్తి, గొండ్యాల రామూర్తి, బార్ల జగన్నాథం, స్థానిక కల్యాణి ఆంగ్ల పాఠశాలలో ప్రిన్సిపాల్ బిందుమాధవిఅంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

వజ్రపుకొత్తూరు : భారత రాజ్యాంగాన్ని కాపాడు కుందామని ఐద్వా జిల్లా నాయకులు సుగుణవతి పిలుపునిచ్చారు. మండలంలోని నగరంపల్లిలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేంద్రంలో బిజెపి ఆర్ఎస్ఎస్ భావజాలాలను అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్.ఈశ్వరమ్మ, కిల్లి వేణమ్మ, గార జానికమ్మ, గార అక్కమ్మ, నెయ్యల సంతోష్, బి.లక్ష్మి, పి.వరలక్ష్మి, హేమలత, సునీల్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిపి బోర పుష్ప, ఎంపిడిఒ ఈశ్వరరావు, కె.మోహనరావు, రాజశేఖరరెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పోలాకి : స్థానిక ఆస్పత్రి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, అలాగే ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, ఆర్.త్రినాథరావు, టిడిపి నాయకులు ఎం.వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, భైరి భాస్కరావు పాల్గొన్నారు.

నందిగాం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గునరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.

టెక్కలి : టిడిపి కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి మండల అధ్యక్షులు బగాది శేషగిరి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, మెండ దమయంతి, పోలాకి షణ్ముఖరావు, మామిడి రాము, బెహరా కాళీ, బసవల అప్పలస్వామి, రెయ్యి ప్రీతీష్ చంద్, ఇప్పిలి జగదీష్, సోడిమూడి కిరణ్ పాల్గొన్నారు.

అలాగే జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గవరయ్య, కుమారస్వామి, త్రివేణి, ఇలపండ రమేష్, ఆబోతు వెంకటరమణ, భాస్కర్, గురయ్య, మౌళి పాల్గొన్నారు. స్థానిక టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఆధ్యాపకులు రవికుమార్, కంచరాన శ్రీనివాసరావు, లూక్‌పాల్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి వైస్ చైర్మన్ సురేష్‌బాబు, బోనెల గోపాల్, తెంబురి మధుసూదన రావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి తెప్పల పాపారావు, కె.రవికుమార్, రైల్వే యూనియన్ నాయకులు గిరి, కాశీబుగ్గ గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సోషల్ డిపార్ట్‌మెంట్ సర్వీస్ అధికారి మల్లేశ్వరరావు, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, సూదికొండ కౌన్సిలర్ ప్రతినిధి శిష్టి గోపి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం సచివాలయం కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


నందిగాం : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తిలక్


రణస్థలం రూరల్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఈశ్వరరావు


కవిటి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

శ్రీకాకుళం: ఈ నెల 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు, మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాలపై దేశం గర్విస్తుందన్నారు. కార్గిల్ పోరాటంలో, బొంబాయి తాజ్ హోటల్ దురాక్రమణ సమయంలోను, ప్రకృతి వైపరీత్యాల సమయంలోను దేశ సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు, జాతి యావత్తు గర్విస్తుందన్నారు. వీర జవానులకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని జిల్లాలోని పౌరులను, వ్యాపార వేత్తలకు, పారిశ్రామిక దారులకు విజ్ఞప్తి చేశారు. విరాళాలను, డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు/డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, పెద్దరెల్లి వీధి, శ్రీకాకుళానికి పంపించాలన్నారు.


అధ్వానంగా తయారైన అలికాం-బత్తిలి ప్రధాన రహదారి

చిత్తడిగా ఎబి రోడ్డు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మిచౌంగ్ తుపానుతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి అలికాం-బత్తిలి ప్రధాన రహదారి చిత్తడిగా మారి వాహనదారులను ఇబ్బందులకు గురి చేసింది. భారీ గుంతలతో ఉన్న రహదారి వర్షపునీటితో గుంతలన్నీ నిండి చెరువులను తలపించాయి. ప్రధాన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ద్విచక్ర వాహనదారులు గుంతలను గుర్తించలేక పలువురు గుంతల్లో పడిలేవడం పట్ల ప్రజలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం వద్ద గుంతల్లో నీరుచేరి ప్రధాన రహదారి చెరువును తలపించింది. నిత్యం వందలాదిమంది నాయకులు, అధికారులు ఇదే రహదారిపై ప్రయాణం చేస్తున్నప్పటికీ కనీసం పట్టించుకున్న పాపాన పోవడంలేదని పలువురు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు కేటాయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

వ్యక్తి మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- సోంపేట


మృత్యుంజయ మృతదేహం

మండలంలోని సోంపేట, బారువ రహదారి పలాసపురం కంబ సమీపంలో బుధవారం కారు పంట కాలువలోకి దూసుకెళ్లడంతో వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. బారువ ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లఊరుకు చెందిన అంకుల మృత్యుంజయ (38), తన స్నేహితులు సాయికుమార్, సురేంద్ర, చక్రిలు కారులో ఇచ్ఛాపురం వ్యక్తిగత పనులపై వెళ్లారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వస్తున్నారు. లక్కవరం సమీపంలో కంబ వద్ద కారు వేగంగా వెళ్తూ రాయిపై ఎక్కింది. వెంటనే కారు సమీపంలోని ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మృత్యుంజయ తీవ్రంగా గాయపడడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. క్షతగాత్రులను స్థానికులు బారువ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కల్పన, కుమార్తె అంకిత ఉన్నారు. కల్పన ప్రస్తుతం గర్భిణి. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు జట్టు ఎంపిక

ప్రజాశక్తి- పలాస

జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యాన రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించారు. జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ కార్యదర్శి పి.తవిటయ్య పర్యవేక్షణలో ఈ ఎంపికల నిర్వహణ చేపట్టారు. పురుషుల జట్టుకు కె.గోవిందరావు, సిహెచ్.తారకేశ్వరరావు, ఎం.మణికంఠ, పి.జగదీష్‌పాత్రో, స్టాండ్ బైగా బి.సిద్ధార్థ, ఎల్.దిలీప్, మహిళా జట్టుకు పి.ప్రవల్లిక, అంకితకుమారి సుందరి, శ్రావణి పాత్రో, జె.భవాని, స్టాండ్ బైగా యు.దీపిక, పి.పుష్పలత అర్హత సాధించారని తవిటయ్య వివరించారు. వీరు ఈ నెల 28 నుంచి 30 వరకు పాతపట్నంలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు టి.చిట్టిబాబు, వ్యాపార వేత్త మల్లా భద్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు సి.హెచ్.పద్మలోచనం, పి.గజేంద్ర, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎంపికైన జట్టు

నేడు స్పీకర్ పర్యటన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని సింధువాడ సచివాలయం పరిధిలోని వీరమల్లిపేట గ్రామంలో నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. గురువారం ఉదయం 7:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొంటారని, మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గోపికి పరంజ్యోతి అవార్డు


గోపి

కవిటి: మండలంలోని ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మొర్రి గోపి పరంజ్యోతి అవార్డుకు ఎంపికయ్యారు. అలతి పదాలతో అద్భుత భావాలు పలికిస్తూ లఘు కవితా ప్రక్రియ చిమ్నీల్లో నవ శతక చిమ్నీలు పూర్తి చేసినందుకు హంసవాహిని సాహిత్య పీఠం అవార్డును తెలంగాణ రాష్ట్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హంస వాహిని సాహిత్య కళా పీఠం కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, చిమ్నీ ప్రక్రియ న్యాయ నిర్ణేతలు జాగిరి యాదగిరి, బసవరాజు, పశుల శంకర్, రాజోలు వరలక్ష్మి, సరిత, కవిటి సర్పంచ్ లక్ష్మణరావు, ఉషోదయ సంఘ ప్రతినిధులు పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధు, ఆరంగి త్రివిక్రమరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి, తమరాల జయరాం, బెందాళం రమేష్, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ముత్యాలపేట ప్రధానోపాధ్యాయులు శాంతిలు అభినందనలు తెలియజేశారు.

వర్షపునీటిని తొలగించాలి

పలాస: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా రోడ్డుపై వర్షపు నీరు, కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా తొలగించాలని కాశీబుగ్గ-పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని నెమలికొండ, దత్తాత్రేయ ఆశ్రమం, నెమలి, నారాయణపురం ప్రాంతాల్లో రూ.35 లక్షల వ్యయంతో చేపడుతున్న పనులు, కెటి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నూతనంగా నిర్మాణం చేపడుతున్న పనులను బుధవారం కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించవద్దని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ పనులు జరిగే సమయంలో తప్పనిసరిగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈయనతో పాటు మున్సిపల్ డిఇ సునీల్‌కుమార్, ఎఇ అవినాష్ ఉన్నారు.


వర్షపు నీటిని పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

ఆర్‌టిసి డ్రైవింగ్ శిక్షణతో ప్రయోజనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవర్లుగా శిక్షణ పొందిన వారికి బహుళ ప్రయోజనం ఉంటుందని జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి విజయకుమార్ తెలిపారు. నగరంలోని ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో 14వ బ్యాచ్‌లో శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు డిపో మేనేజర్లు పి.బి.ఎం.కె రాజు, కె.ఆర్.ఎస్ శర్మల చేతుల మీదుగా బుధవారం సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందిన తర్వాత వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌సిజి ఎఎన్ఎస్ శ్రీనివాస్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ పాల్గొన్నారు. అలాగే 15వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆసక్తి ఉన్నవారు 9963091999, 7382923293 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.


ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఆర్‌టిసి అధికారులు

సైతక శిల్పి హరికృష్ణకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ఆర్ఆర్ కాలనీకి చెందిన సైతక శిల్పి గేదెల హరికృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. ఒడిషా రాష్ట్రం పూరీలో ప్రతిఏటా జరిగే ఇంటర్నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్ పోటీల్లో పాల్గొని ఉత్తమప్రతిభ కనపర్చినందుకు సిల్వర్ కోణార్క్ షీల్డ్‌తో సత్కరించి ప్రశంశా పత్రంతో పాటు ఉత్తమ అవార్డును అందించినట్లు సైకత శిల్పి గేదెల హరికృష్ణ తెలిపారు. ప్రఖ్యాత దేవాలయాలు, వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ సైతక శిల్పాన్ని వేయాలని నిర్వాహకులు తెలుపగా తాను జిల్లాలోని ప్రఖ్యాత దేవాలయం శ్రీ కూర్మానాథ దేవాలయం శిల్పాన్ని ఆవిష్కరించడంతో సెలెక్ట్ కమిటీ సభ్యులు మెచ్చుకొన్నారని, వీటితో పాటు మరో రెండు శిల్పాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చినందుకు ప్రథమ విజేతగా ప్రకటించారని పేర్కొన్నారు. ఒడిషా ప్రభుత్వం తన ప్రతిభను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం పట్ల హరికృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో అమెరికా, రష్యా, చెక్ రిపబ్లిక్, శ్రీలంకతో పాటు పలు దేశాలకు చెందిన 120 మంది కళాకారులు పాల్గొన్నారని తెలిపారు.


ప్రశంసాపత్రంతో హరికృష్ణ

వరికుప్ప దగ్ధం


పరిశీలిస్తున్న తహశీల్దార్ సరోజని

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జలకలింగపురంలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదం లో సోనాపురం లక్ష్మీనారాయణకు చెందిన ఎకరా 20 సెంట్ల వరి కుప్ప దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పి.సరోజని, ఆర్ఐ కంట్రోల్ రెవెన్యూ సిబ్బంది బుధవారం పరిశీలించారు. రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతైందని బాధితుడు వాపోయారు. సంఘటన స్థలాన్ని జనసేన మండల నాయకులు దుక్క బాలరాజు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి పరామర్శించారు.

ప్రతి గింజా కొనుగోలు


మాట్లాడుతున్న రాజేశ్వరరావు

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ధానం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెదుళ్లవలసలో ఉన్న సొసైటీ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నేపథ్యం ధాన్యం రంగు మారినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం 850 క్వింటాళ్ల ఆఫ్ లైన్ ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. మండలంలో డిసిఎంఎస్ ద్వారా 2 కేంద్రాలు, సొసైటీ ఆధ్వర్యాన 17 కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో ప్రభుత్వ నిబంధనలు మేరకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయన, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, సొసైటీ సిఇఒ బ.రాంబాబు, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కులగణనపై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- రణస్థలం

మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ ఆర్‌వి.రమణమూర్తి అధ్యక్షతన కులగణన మండలస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కులాలవారీగా అధికారిక సర్వే కులగణనకు ప్రభుత్వం నిర్ణయించిందని, రాష్ట్రమంలా ఈ సర్వే మొదలు పెట్టేందుకు అధికారులు కార్యచరణ సిద్ధం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని, కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


కులగణన సర్వేపై ప్రతిఒక్కరు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, చిన్నపాటి పొరపాట్లకు తావివ్వకుండా వారంరోజుల వ్యవధిలో ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. కులగణన సర్వేలో సంబంధిత శాఖల అధికారులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి సాయికుమార్, జెడ్‌పిటిసి టి.సీతారాం పాల్గొన్నారు.


రణస్థలం : మాట్లాడుతున్న ఎంపిడిఒ రమణమూర్తి

కుల గణన బాధ్యతగా చేయాలి

పలాస: ఈ నెల 9 నుంచి ప్రభుత్వం చేపడుతున్న కుల గణన బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అధ్యక్షతన కుల గణనపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని విభాగాల్లో జవాబుదారీతనం ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. భూముల రీ సర్వేతో సత్ఫలితాలను ఇస్తోందని వివరించారు. ఆరోగ్య సురక్ష పేరుతో ప్రజారోగ్యంపై సర్వే చేసి ఆరోగ్య కార్డులను అందజేస్తుందని అన్నారు. ఇఒపిఆర్‌డి, సర్పంచ్ నీలవతి, సర్పంచ్ ప్రతినిధి తిరుపతిరావు, చినంచల, గురుదాస్‌పురం, బొడ్డపాడు ఎంపిటిసిలు బమ్మిడి దుర్యోధన, షణ్ముఖరావు, పాపారావు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


కాలి బూడిదైన వరి పంటను పరిశీలిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడికి అధికారులు, ప్రభుత్వం న్యాయం చేయాలని జిల్లా టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలో పెద్దపేట పంచాయితీ కొండపేట గ్రామంలో పాలక శంకరయ్య గిరిజన రైతుకు చెందిన ఐదెకరాల వరికుప్ప అగ్నికి ఆహుతి కావడంతో పరామర్శించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులు చేసి పంట పండించి చేతికి వచ్చే సమయంలో వరి కుప్ప దగ్ధమైందన్నారు.

రైతులను...

గత మూడు రోజులుగా తుపాను ప్రభావం కారణంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతులు పండించిన పంటలు పాడయ్యాయని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కూన రవికుమార్ అన్నారు. మండలంలో సుమారు అన్ని గ్రామాల్లో రైతులు వరికోతలు కోసి పొలాల్లోనే ఉంచారన్నారు. వర్షానికి తడవడం వలన మొలకలు వచ్చే అవకాశం ఉందన్నారు. రంగు మారిన ధాన్యం ప్రభుత్వం తరఫున అధికారులు మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం వర్షానికి తడిచిన వరి చేనును పరిశీలించారు. ఆయనతో పాటు తుడ్డలి సర్పంచ్ అంపిలి గణపతిరావు, కడగల కృష్ణ, జల్లు పోలినాయుడు, బిసిసెల్ మండల అధ్యక్షుడు దుర్గారావు, ఆదినారాయణ, నారాయణరావు, మామిడి వెంకట అప్పలనాయుడు, మజ్జి అప్పలనాయుడు ఉన్నారు.


విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు సిలబస్ త్వరితగతిన పూర్తిచేయాలని, ఎంసెట్, నీట్ వంటి పరీక్షలకు ఇప్పటి నుంచే చదివించాలని సర్వశిక్షా అభియాన్ ఎఎంఒ జి.లక్ష్మీనారాయణ ఆదేశించారు. స్థానిక కస్తూరిబాను బుధవారం సందర్శించారు. ఎంపిపి, బైపిసి విద్యార్థుల ప్రగతిని, 8,9,10 తరగతుల పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు దగ్గరపడుతున్నాయని, త్వరగా సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే స్థానిక బిసి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు రాస్తున్న పరీక్షను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

గ్రామ జల సంఘాల ఏర్పాటు


రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతంలో ప్రతి కుటుంబానికి సురక్షిత మంచినీరు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం జలజీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా ఇంటింటికి మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేయడంలో జరిగే పనులను నాణ్యతగా నిర్వహించడం కొరకు అదే గ్రామంలో మహిళా సంఘాలు ముందుకు వచ్చి బాధ్యత వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ గ్రామ జల సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మాసయ్యపేట గ్రామంలో మహిళ స్వయంశక్తి సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కమిటీలో స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఇంజినిరింగ్ అసిస్టెంట్‌తో పాటు అదే గ్రామానికి చెందిన 9 మంది స్వయంశక్తి సంఘాల మహిళలు భాగస్వాములుగా ఉండి, ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా సురక్షితమైన మంచినీరు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న కొళాయి పనులను ప్రభుత్వ సూచనల మేరకు నాణ్యతగా జరిగేలా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ, వి.ఒ.ఎ రాజేశ్వరి, గ్రామ సంఘం అధ్యక్షురాలు రేణుకతో పాటు గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వజూఖానా ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో జిటి రోడ్డులో ఉన్న జామియా మసీదు ప్రాంగణంలో నిర్మించిన వజూఖానను జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ ప్రారంభించారు. బుధవారం ఆయన మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీనకాలం నాటి జామియా మసీదు విశాలమైన ప్రాంగణంలో ఉందని, ఈ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షులు భయ్యా సేర్, సెక్రెటరీ అక్బర్ భాషా, జాయింట్ సెక్రెటరీ శుకుర్ ఖాన్, కోశాధికారి ఉస్మాన్, సభ్యులు డెంటల్ రఫీ, షఫి, అబ్దుల్, కరీం, మీనా, మసీదు అధ్యక్షులు చోటు, చంపా మసీదు సెక్రెటరీ ఎం.ఎరజాక్, అలేహదేస్ మసీదు అధ్యక్షులు హాజీ షానవాజ్, ఇన్‌స్పెక్టర్ ఆడిట్ సాదిక్, రియాజ్ పాల్గొన్నారు,

పథకాల ఛార్టు


పథకాల ఛార్టును విడుదల చేస్తున్న ప్రకాష్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- కవిటి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ కోరారు. మండలంలోని రాజపురంలో బుధవారం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అవనీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, దానికి ఆర్థికసాయం, మహిళకు ప్రత్యేక గుర్తింపు సిఎం జగన్‌నే సాధ్యమైందన్నారు. అనంతరం ప్రథకాలతో కూడిన ఛార్ట్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ససపల జానకిరావు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, ఎఎంసి వైస్ చైర్మన్ నీలయ్య, ఎంపిటిసిలు ఎస్.కృష్ణారావు, పిరియ ఆనంద్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, బొర్ర రమేష్, సచివాలయ కన్వీనర్ ఢిల్లీబాబు పాల్గొన్నారు.

స్పందన ఫౌండేషన్ ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న స్పందన ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా స్పందన ఫౌండేషన్ సభ్యులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. వైజాగ్‌కు చెందిన బొడ్డు ఈశ్వరమ్మ గత నెల ప్రమాదానికి గురై గాయపడింది. తర్వాత ఆ గాయం తీవ్ర ఇన్‌ఫెక్షన్‌గా మారి రెండు తొడలు ఎముక కనిపించేంతగా మజిల్ డామేజై చికిత్స పొందుతుంది. ఈమె భర్తకి కూడా పెరాలసిస్ వచ్చి కాలు, చేయి పూర్తిగా పనిచేయడం లేదు. కుమారైలిద్దరికి పెళ్ళవ్వడంతో ప్రస్తుతం ఈమె బాధ చూడలేక చెల్లి కూతురు నర్సాపురంలో వారి ఇంటికి తెచ్చి బాగోగులు చూస్తుంది. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో స్పందన ఫౌండేషన్ వీరి విజ్ఞాపన మేరకు పేషంట్‌ను పరామర్శించి వైద్య ఖర్చులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ అధ్యక్షులు షణ్ముకరావు, సర్పంచ్ భూషణ్ రెడ్డి, ఫల్గునరెడ్డి, భువన రెడ్డి, సిమ్మన్న పాల్గొన్నారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పొలంలోనే వదిలిపెట్టి ఉన్న వరి పనులపై ఉప్పు ద్రావణం 50 గ్రాములు లీటర్ చొప్పున 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరాకి పిచికారీ చేయాలని మండల ఎఒ దానకర్నుడు సూచించారు. మండలంలోని వసుంధరలో వరి పంట కోసి పొలంలో తడిచిన పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసినట్లయితే ధాన్యం మొలకెత్తకుండా నివారించుకోవచ్చునని తెలిపారు.


పరిశీలిస్తున్న ఎఒ దానకర్నుడు


చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్న పలువురికి సిఎం సహాయనిధి నుంచి వచ్చిన ఆర్థికసాయాన్ని బుధవారం రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అందజేశారు. నగర శివారులో గల పేపరుసిటీలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు చెక్కులను అందజేశారు. గార మండలం అంపోలు గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మికి రూ.5 లక్షల చెక్కు, శ్రీకాకుళం మండలం శ్యాంపాలెంకి చెందిన లోద్దు రాధాభాయ్‌కు రూ.1.5 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కళింగకోమటి కార్పోరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, శ్రీశయన కార్పోరేషన్ చైర్మన్ డిపి దేవ్, రవిశంకర్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

నందిగాం: క్రిస్టియన్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని తురకలకోట వద్ద ఉన్న చర్చిలో బుధవారం నిర్వహించిన టెక్కలి నియోజకవర్గ ఫాస్టర్స్ ఫెలోషిప్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్కలి నియోజక ఫాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు కనితి అబ్రహం, కె.జె.ఎస్.ప్రేమ్‌కుమార్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, మండల జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల పార్టీ అధ్యక్షులు తమరి ఫాల్గుణరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి ఆర్.కూర్మారావు, సర్పంచ్‌లు శాంతారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిలక్

వచ్చే ఎన్నికల్లో పోటీకి సహకరించాలి

మెళియాపుట్టి : వచ్చే ఎన్నికల్లో తాను పాతపట్నం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను గెలిపించాలని నియోజకవర్గ నాయకులు విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు కోరారు. మండలంలోని పెద్దపద్మాపురం, మెళియాపుట్టి, పట్టుపురం తదిత గ్రామాల్లోని మంగళవారం రాత్రి 'గ్రామ పెద్దలను కలుద్దాం... యువతకు చెబుదాం' కార్యక్రమం


రామారావుతో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

నిర్వహించారు. పెద్దపద్మాపురంలో విశ్రాంత ఉపాధ్యాయులు లింగాల సంజీవరావును, మెళియాపుట్టికి చెందిన మాజీ ఎంపిపి మాడుగుల రామారావును, పట్టుపురంలో సర్పంచ్ సంపతిరావు, లక్ష్మి, చంద్రరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని, తనకు ఆశీర్వదించాలని కోరారు. పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి తాను రూపొందించిన మేనిఫెస్టోలోని అంశాలను వారికి వివరించారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ రాజారావు, లింగాల వెంకట మధు, భాస్కరరావు పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న తిరుమలరావు

వైఎస్‌ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రెంటికోటకు చెందిన కద్దాల మధుసూదనరావు ఇటీవల మృతి చెందారు. ఈయనకు వైఎస్‌ఆర్ బీమా వర్తించడంతో తక్షణ సాయం కింద రూ.పది వేలు సర్పంచ్ శాసనపురి తిరుమలరావు మృతుడి భార్య హంసవేణికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సద్గుణబాబు, విఆర్ఒ ప్రసాద్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- కవిటి

ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధవహించి ప్రభుత్వ స్పత్రులను కార్పొరేట్ సొబగులు అద్దారని, వైద్య సిబ్బంది పూర్తి నిబద్ధతో పనిచేసి ప్రజలకు సేవచేయాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ సూచించారు. మండలంలోని రాజపురం పిహెచ్‌సిలో డాక్టర్ శశిధర్ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ మేరకు ఆస్పత్రి సదుపాయాలు, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ స్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలు పొందేలా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది చూడాలని సూచించారు. ఎంపిడిఒ సూర్య నారాయణరెడ్డి, తహశీల్దార్ పి.శేఖర్, సర్పంచ్ జానకిరావు, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, ఎంపిటిసి కృష్ణారావు, ఎన్ని అశోక్, డాక్టర్ మౌనిక, ఎఒ అభిమన్యు సోయి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రకాష్


మాట్లాడుతున్న తహశీల్దార్ చక్రవర్తి

రీ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ ఎం.చక్రవర్తి కోరారు. మండలంలోని కలిగాంలో భూముల రీసర్వేకు బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వేలో రైతులు భాగస్వామ్యం కావాలన్నారు. భూమికి సంబంధించిన పత్రాలను సర్వే సమయంలో రెవెన్యూ అధికారులకు అందించాలన్నారు. రీ సర్వే మ్యాప్ సిద్ధంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అనంతకుమార్, సర్పంచ్ ససపల కోటేశ్వరరావు, విఆర్ఒ నారాయణరావు, గ్రామ సర్వేయరు అల్లు తిరుపతిరావు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్

కోటబొమ్మాళి: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యమని టిడిపి నాయకులు బెండి అన్నపూర్ణ అన్నారు. మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ బిర్లంగిలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ టిడిపి మేనిఫెస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్రాయి మల్లేష, సాసుమంతు ఆనంతరావు పాల్గొన్నారు.

9న ఉచిత నేత్ర వైద్య శిబిరం

సోంపేట: స్థానిక రోటరీ క్లబ్ భవనంలో ఈ నెల 9న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గ్రేస్, రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా పవర్ గ్లాసులు, కళ్లద్దాలు, ఫ్రేములు, మందులు అందిస్తామని తెలిపారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర పథకాలపై అవగాహన

కోటబొమ్మాళి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడు పంచాయతీలో ప్రధానమంత్రి పిలుపు మేరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులను, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌ను అందజేశారు. అంతకుముందు కేంద్ర పథకాలను వివరించే 2024 సంక్షేమ కేలండర్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్ ప్రతినిధి నేతింటి అప్పలస్వామి, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.